సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 28 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.33,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33,500 పలికాయి. మార్కెట్‌కు 987 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం

39.5°/18.6°

భానుడి భగభగలతో జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.



మంగళవారం	బుధవారం
ఇఫ్తార్	సెహరి
6.33	5.01

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

జిల్లాకు నాలుగు 104 వాహనాలు

- జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ బసంత్‌కుమార్



జెండా ఊపి 104 వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, డీఎంహెచ్‌ఓ

పుట్టపర్తి అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని వారికి మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం జిల్లాకు 104 సంచార వాహనాలు కేటాయించింది. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ బసంత్ కుమార్ డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ కృష్ణారెడ్డితో కలిసి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు నాలుగు వాహనాలు రాగా మూడింటిని మడకశిర, గోరంట్ల, ముదిగుబ్బ మండలాలకు కేటాయించామన్నారు. మరో వాహనం జిల్లా కేంద్రంలో అదనంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో 104 జిల్లా నోడల్ ఆఫీసర్ సెల్వియా, జిల్లా మేనేజర్ శంకర్, వైద్యాధికారి నాగరాజు నాయక్, ఎగ్జిక్యూటివ్‌లు కృష్ణ, ఆదినారాయణ, జుబీర్ తదితరులు ఉన్నారు.

ఫార్మా-డీ ఫస్టియర్ సప్లి ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఫిబ్రవరి, మార్చిలో నిర్వహించిన ఫార్మా-డీ మొదటి సంవత్సరం (ఆర్-17) అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



ప్రశాంతి నిలయం: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం 99 కేంద్రాల్లో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 787 మంది గైర్హాజర్ అయ్యారు. ఇందులో జనరల్‌కు సంబంధించి ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 28,833 మందికి గాను 28స151 మంది హాజరయ్యారు. 682 మంది గైర్హాజరయ్యారు. ఇక ఒకేషనల్ విద్యార్థులు 2,602 మందికి గాను 2,497 మంది హాజరుకాగా, 105 మంది గైర్హాజరయ్యారు.

ఆ ప్రశ్నకు రెండు మార్కులు

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు సోమవారం జరిగిన ఫిజిక్స్ పరీక్షకు సంబంధించి మూడో ప్రశ్న గందరగోళంగా ఉండడంతో సమాధానం రాసినా, రాయకపోయినా రెండు మార్కులు కలపనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించిందని ఆర్ఐఓ సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

మెడికల్ కళాశాల స్నాతకోత్సవం రేపు



అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం సాయంత్రం స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ నాగలక్ష్మి, లోక్‌సతా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, నంద్యాల డిప్యూటీ కలెక్టర్ భరత్‌నాయక్, ఇన్‌కం ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన తదితరులు హాజరుకానున్నారు. 2017 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు.

భౌ..బాబోయ్



- రెండు రోజుల క్రితం కదిరిలో వీధి కుక్క కరవడంతో తీవ్రంగా గాయపడిన ఓ చిన్నారి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. అంతకు మునుపు కొద్ది నెలల క్రితం పట్టణంలోని సైదాపురం, వైఎస్సార్ నగర్, అడపాల వీధుల్లో ఒకే రోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో కుక్కల గుంపు స్వైర విహారం చేసి 17 మంది చిన్నారులతో పాటు మరో మహిళను సైతం తీవ్రంగా గాయపరిచింది.
- గాండ్లపెంటలో ఇటీవల ఓ పిచ్చికుక్క కరవడంతో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు.
- బత్తలపల్లి మండలం యర్రాయపల్లిలో ఇటీవల కుక్కలు దాడి చేయడంతో తన మందలోని 23 గొర్రె పిల్లలు మృతి చెందాయని బాధితుడు బాలకొండ శివయ్య తెలిపారు.
- ధర్మవరంలోని శాంతినగర్‌లో ఆరుగురు చిన్నారులపై ఇటీవల వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి.
- హిందూపురం మోడల్ కాలనీలో ఇటీవల వీధి కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు.

...ఇలా జిల్లా వ్యాప్తంగా వీధి కుక్కలు చెలరేగిపోతున్నాయి. రోడ్డుపై కనిపించిన వారిపై దాడి చేస్తున్నాయి. బాధితుల్లో ఎక్కువగా చిన్నారులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

- చెలరేగిపోతున్న వీధి కుక్కలు
- రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్న జనం
- బైక్‌పై వెళ్తున్నా వెంటబడి దాడి చేస్తున్న వైనం
- పశువులనూ వదిలి పెట్టని గ్రామ సింహాలు



కదిరిలోని ఓ వీధిలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

కదిరి: వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. రోడ్డుపైకొచ్చిన వారిపై దాడి చేస్తున్నాయి. దీంతో రోజురోజుకూ కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. చివరకు మూగజీవాలపై కూడా కుక్కలు దాడి చేస్తుండటంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. హైదరాబాద్‌లో ఇటీవల పట్టపగలు ఓ బాలుడిని వీధి కుక్కలు కరచి చంపేశాయి. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారగా...ఆ దృశ్యాన్ని చూసిన వారి హృదయం తరుక్కుపోయింది. జిల్లాలోనూ ఇటీవల కుక్కకాటు సంఘటనలు పెరిగాయి. వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ, ఎదురు పడిన వారిపై దాడికి దిగుతున్నాయి. దీంతో జనం భయపడుతున్నారు. నడిచి వెళ్లే వారినే కాకుండా బైక్‌పై వేగంగా వెళ్తున్నా.. కుక్కలు వెంటబడి మరీ కరుస్తున్నాయి.

ఎండాకాలంలో ఎక్కువ కేసులు..

ఎండాకాలంలో వీధి కుక్కలకు ఆహారం, నీరు సరిగా లభించదని, దీనికి తోడు ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల కుక్కల్లో ఇరిటేషన్ పెరిగి అవి దాడులు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. మిగతా మాసాల కంటే వేసవిలోనే కుక్కకాటు కేసులు ఎక్కువగా ఉంటాయంటున్నారు. ఈ రెండు మూడు నెలల కాలంలో కుక్కల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

శునకాలు పట్టేస్తున్నా... కు.ని.కి పాటేనా?

గత ప్రభుత్వం వీధి కుక్కల సమస్యను గాలికొదిలేయడంతో వాటి సంతతి బాగా పెరిగి పోయింది. వీటిని చంపడానికి నిబంధనలు ఒప్పుకోనందున, స్టెరిలైజేషన్ ఆపరేషన్‌లు చేసి వదిలేయాల్సి వస్తోంది. అలాగే పెంపుడు కుక్కల వివరాలను ఆయా మున్సిపాలిటీల్లో నమోదు చేయించాల్సి ఉంది. కానీ జిల్లాలోని ఏ మున్సిపాలిటీలోనూ కుక్కల నమోదు సరిగా జరగలేదు. అధికారుల వద్ద ఉన్న గణాంకాల ప్రకారం జిల్లాలోని మున్సిపాలిటీల్లో 1,547 పెంపుడు కుక్కలు, 32,960 వీధి కుక్కలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటికి తోడు మండలాల పరిధిలోని గ్రామాల్లోని కుక్కలను సైతం లెక్కిస్తే జిల్లా వ్యాప్తంగా సుమారు 1.60 లక్షల పెంపుడు, వీధి కుక్కలు ఉంటాయని అధికారులు అంటున్నారు. గడచిన మూడు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 2,860 కుక్క కాటు కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

స్టెరిలైజేషన్‌కు రూ.500 ఖర్చు..

ఒక్కో కుక్కకు కు.ని శస్త్ర చికిత్స చేయాలంటే రూ.500 ఖర్చు అవుతుంది. ఇప్పటికే మున్సిపాలిటీల్లో కుక్కలను పట్టుకొని కు.ని శస్త్ర చికిత్సలు చేయించినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ పట్టణ, మండల కేంద్రాల్లోని చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్డు పక్కన పడేయటంతో అక్కడికి పదుల సంఖ్యలో కుక్కలు చేరి పోట్లాడుకొని అడ్డొచ్చిన జనంపై దాడులకు దిగుతున్నాయని పలువురు అంటున్నారు. వ్యర్థాలు రోడ్డు పక్కన వేయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మున్సిపాలిటీ	పెంపుడు కుక్కలు	వీధి కుక్కలు
కదిరి	302	6,700
ధర్మవరం	415	8,650
పుట్టపర్తి	105	2,600
మడకశిర	125	3,060
హిందూపురం	485	9,850
పెనుకొండ	115	2,100
మొత్తం	1,547	32,960

అందుబాటులో వ్యాక్సిన్లు



కుక్కల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దాడి చేసిన కుక్కకు రేబీస్ వ్యాధి ఉంటే ఆ వ్యాధి బాధితునికీ సోకే ప్రమాదం ఉంది. అందువల్ల కుక్క కరచిన వెంటనే యాంటి రేబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. గతంలో బొడ్డు చుట్టూ వేసేవారు. ఇప్పుడు చేతికే వేస్తారు.

– ఎస్‌వీ కృష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ

ప్రత్యేక చర్యలు చేపట్టాం



కుక్కలు ప్రజలపై దాడి చేయకుండా చర్యలు తీసుకుంటున్నాం. వీధి కుక్కలకు కు.ని శస్త్ర చికిత్సలు చేయించి దూరంగా వదిలిపెడుతున్నాం. అన్ని మున్సిపాలిటీల్లోనూ ఇదే జరుగుతోంది. పెంపుడు కుక్కలకు యజమానులు విధిగా ట్యాగ్ వేయాలి. పెంపుడు కుక్కలకు తప్పకుండా యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు వేయించాలి.

–శ్రీహరిబాబు, మున్సిపల్ కమిషనర్, కదిరి

మాదక ద్రవ్యాల విక్రేతలపై..

ఉక్కుపాదం

- ఎస్పీలతో టెలీకాన్ఫరెన్స్‌లో డీఐజీ రవిప్రకాష్



మాట్లాడుతున్న డీఐజీ రవిప్రకాష్

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: మాదకద్రవ్యాల విక్రేతలపై ఉక్కుపాదం మోపాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ ఆదేశించారు. సోమవారం అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల పోలీసు అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. డ్రగ్స్ కేసులపై సమీక్షించారు. ప్రధానంగా మాదకద్రవ్యాల (డ్రగ్స్) తయారీ, సరఫరా, విక్రయం, కొనుగోలుతో సంబంధమున్న ప్రతి ఒక్కరిపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమర్షియల్ క్వాంటిటీ కేసుల్లో (20 కిలోల కంటే ఎక్కువ మోతాదులో ఉన్న గంజాయి) లోకల్ పెడ్లర్స్‌ను గుర్తించాలన్నారు. వీరికున్న కీలక నిందితులను లింకు చేయాలని, గంజాయి వినియోగించే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. మూడు, అంతకంటే ఎక్కువ కేసుల్లో నిందితులుగా ఉంటే అలాంటి వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. ముఖ్య పట్టణాలలో గంజాయి, తదితర మత్తు పదార్థాల అనర్థాలను వివరించే హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. కళాశాలలకు వెళ్లి మత్తు పదార్థాలు, అనర్థాలపై కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా పెట్టి.. మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలని సూచించాలన్నారు. ఈ కేసుల ఛేదింపునకు బాగా పని చేసిన వారికి రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. చెక్ పోస్టులు, ప్రత్యేక దాడులు నిర్వహించి కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఎస్పీలు డాక్టర్ ఫక్కీరప్ప, రాహుల్‌దేవ్‌సింగ్, రిషాంత్‌రెడ్డి, రేంజ్ పరిధిలో నాలుగు జిల్లాల అదనపు ఎస్పీలు, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల ఎస్డీపీఓలు, నాలుగు జిల్లాల డీసీఆర్బీ సీఐలు, తిరుపతి, చిత్తూరు జిల్లాల సెబ్ అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం సహించం

- కలెక్టర్ బసంత్‌కుమార్



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, డీఆర్‌ఓ

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన' కార్యక్రమంలో అందే ప్రతి అర్జీని గడువులోపు పరిష్కరించాలని, అందులో ఏ స్థాయి అధికారి అలసత్వం వహించినా సహించబోమని కలెక్టర్ బసంత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్సు హాలులో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 190 అర్జీలు అందగా, అధికారులు వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'స్పందన' అర్జీలను ఆయా శాఖల అధికారులు బాధ్యతగా తీసుకొని పరిష్కరించాలన్నారు. ఇందులో ఎటువంటి అలసత్వానికి వీలులేదన్నారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపి మరోసారి అర్జీదారు జిల్లా కేంద్రం వరకూ రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీసీఓ కృష్ణానాయక్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఈఓ మీనాక్షి, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో అందిన అర్జీల్లో కొన్ని ఇలా...

హిందూపురం మెప్మా పరిధిలో వికలాంగుల సమైక్య సంఘం డిపాజిట్ డబ్బు రూ.60 వేలు సంఘం సీఓ మురళీకృష్ణ తినేశాడని సంఘం సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే సంఘ సభ్యులకు అందాల్సిన 'పసుపు-కుంకుమ, వైఎస్సార్ ఆసరా రెండు విడతల సొమ్మును తన కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించాడన్నారు.

- తన భర్త వెంకటశివారెడ్డి మూడేళ్ల క్రితం మృతి చెందారని, ఆయన పేరుతో ఉన్న 8 ఎకరాల భూమిని తన పేరుపై బదయించాలని కోరినా, ఎవరూ పట్టించుకోవడం లేదని నల్లమాడ మండలం యర్రవంకపల్లికి చెందిన నాగమ్మ ఫిర్యాదు చేశారు. 90 ఏళ్ల వయస్సులో కళ్లు కనిపించకున్నా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- ఓడీసీ మండలం ఉంట్లవారిపల్లి సర్వే నంబర్ 401-3, 401-6లోని 6.40 ఎకరాలు తన పేరుపై ఉండగా, ఇటీవల అధికారులు మరొకరి పేరుపై పట్టాదార్ పాస్ పుస్తకం మంజూరు చేశారని లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

జగనన్న రుణం తీర్చుకోలేనిది

పెనుకొండ: వాల్మీకుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీ తీర్మానం చేసిన నేపథ్యంలో సోమవారం వారు వాల్మీకి నాయకులు, వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి పట్టణంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ, వాల్మీకులు అన్ని విధాలుగా వెనుక బడి ఉన్నారని, దీన్ని గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకుల స్థితి గతులను అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు శామ్యూల్ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించారన్నారు. కమిషన్ సిఫార్సు మేరకు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తీర్మానం చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ వాల్మీకులకు ఎన్నో పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు. అందువల్ల వాల్మీకులందరం జగనన్న వెంట నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు పొగాకు రామచంద్ర, పాదయాత్ర నటేష్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ బోయనరసింహ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, వెంకటరత్నం, మునిమడుగు శ్రీనివాసులు, సత్తి, రామాంజనేయులు, రంగేపల్లి నరసింహ, గుట్టూరు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

'గడప గడపకూ' పనులన్నీ పూర్తి చేయాలి





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్, హాజరైన జిల్లా స్థాయి అధికారులు

పుట్టపర్తి అర్బన్: 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో గుర్తించి మంజూరు చేసిన వాటితో పాటు వివిధ అభివృద్ధి పనుల్లో పురోగతి చూపించాలని అధికారులను కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల పురోగతిపై ప్రతి సోమ, మంగళవారాల్లో మండల, డివిజన్ స్థాయిలో సమీక్ష నిర్వహించుకోవాలన్నారు. జిల్లాలో 57 గ్రామ సచివాలయాలు, 50 ఆర్బీకేలు, 42 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయన్నారు. ఇంకా ప్రారంభం కాని 74 భవనాలకు సంబంధించిన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. అలాగే 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో మంజూరైన 1,227 పనుల్లో 1,099 పనులు గ్రౌండింగ్ చేశారన్నారు. తక్కిన 128 పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు.

ఆధార్ కోసం ప్రత్యేక క్యాంపులు..

ఆధార్ అప్‌డేషన్ 100 శాతం పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళ, బుధ వారాల్లో జిల్లా వ్యాప్తంగా 75 స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహించాలన్నారు. వలంటీర్ల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు డిజిటల్ అక్నాలెడ్జ్‌మెంట్ పెండింగ్‌లో ఉందని ముఖ్యంగా హిందూపురం అర్బన్, కదిరి అర్బన్, అమడగూరు అర్బన్, అమడగూరు, గోరంట్ల మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. సంబంధిత ఎంపీడీఓలు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఈఓ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' నోటిఫికేషన్ సిద్ధం చేయండి

జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఐసీడీఎస్ ఆర్‌జేడీ పద్మజతో సమావేశమయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల నియామకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్ల పోస్టులను గుర్తించి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. అలాగే సీడీపీఓల మార్పులు, సూపర్‌వైజర్ల పదోన్నతి, కేంద్రాల మార్పు తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, తిప్పేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

'యువగళం' అట్టర్ ఫ్లాప్

జన సమీకరణకు నేతల పాట్లు

- మద్యం, డబ్బు విచ్చలవిడిగా పంపిణీ చేసినా ఫలితం శూన్యం
- వెలవెలబోయిన గోరంట్ల సభ



లోకేశ్ ప్రసంగిస్తున్న సమయంలోనూ ఖాళీగా కనిపిస్తున్న మైదానం

సాక్షి, పుట్టపర్తి/పెనుకొండ: నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర టీడీపీకి ఊపు తెస్తుందని ఆపార్టీ నేతలు భావిస్తుండగా...క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఎక్కడ కూడా ఊహించిన స్థాయిలో 'స్పందన' రాకపోగా, తమ్ముళ్ల మధ్య ఉన్న అంతర్గత విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. దీంతో 'కొండనాలుక్కి మందేస్తే ఉన్న నాలుక పోయిందన్న' చందంగా 'యువగళం' సాగుతోంది.

సభ అంతా స్థానికేతరులే..

కదిరి, పుట్టపర్తి తర్వాత యువగళం పాదయాత్ర సోమవారం పెనుకొండ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. పెనుకొండలో ముగ్గురు నేతలు ఉండటమే కాకుండా వారి మధ్య సమన్వయం లేకపోవడంతో 'యువగళం' పాదయాత్రకు స్పందన కరువైంది. ఈ క్రమంలోనే పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్ అయింది. ఎకరా స్థలంలో సభ ఏర్పాటు చేసినా జనాలు నిండకపోవడం గమనార్హం. ఉన్న వారిలో సగం మందికి పైగా నిత్యం నారా లోకేశ్ వెంట ఉండేవారే. కొత్తగా జనాలు రాకపోవడంపై నియోజకవర్గ నాయకులతో ఆయన ప్రత్యేకంగా చర్చించినట్లు సమాచారం. డబ్బు, మద్యం, పెట్రోల్ పంపిణీ చేసినా రాకపోవడం ఏంటనే దానిపై బీకే పార్థసారథి సెకండ్ క్యాడర్‌పై మండిపడ్డారని తెలిసింది. గోరంట్లకు వచ్చిన వారిలో రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల ప్రజలు కూడా కొందరు ఉండటం విశేషం.

ఎవరికి వారే యమునా తీరే..

యువగళం పెనుకొండ నియోజకవర్గంలో ప్రవేశించినప్పటి నుంచి నిమ్మల కిష్టప్ప, సవితమ్మ, బీకే పార్థసారథి ఎవరికి వారుగా వ్యవహరించారు. పైగా నియోజకవర్గంలో సభలు సక్సెస్ అయితే తమ పరిస్థితి ఏమిటని మిగతా నేతలు ఆలోచించడంతో పరిస్థితి తారుమారైంది. నిమ్మల కిష్టప్ప సొంత మండలం గోరంట్ల కావడంతో.. బీకే ప్లాన్‌లు బెడిసికొట్టాయి. అంతేకాకుండా బీకే ఎత్తులకు పైఎత్తులు వేసేందుకు సవితమ్మ మరో టీంను రెడీ చేసినట్లు సమాచారం.

ఎత్తుకు పైఎత్తు..

సవితమ్మ ఎక్కడ లోకేశ్‌కు దగ్గరై తన టికెట్‌కు ఎసరు పెడుతుందోనని భావించిన బీకే పార్థసారథి ఆద్యంతం లోకేశ్ వెంటే నడిచారు. బహిరంగ సభలోనూ ఆమెకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. దీనికి పోటీగా సవితమ్మ వర్గం భారీ హంగామా చేసింది. సవితమ్మతో పాటు ఆమె భర్త కూడా పాదయాత్రలో లోకేశ్‌ను అనుసరిస్తూ అనేక సూచనలు చేస్తున్నారు. పాదయాత్ర తాము చేపడుతున్న అన్నా క్యాంటీన్ మీదుగా నడిపి లోకేశ్ చేతుల మీదుగా భోజనాలు వడ్డించాలని సవితమ్మ వర్గం భావించింది. ఈమేరకు లోకేశ్‌కు ఈ విషయం వెల్లడించగా ఆయన ఓకే అన్నట్లు ఆ వర్గం చెబుతోంది. కానీ బీకే వర్గం మాత్రం నిర్దేశించిన మేరకే హైవే మీదుగా పాదయాత్ర కొనసాగిద్దామని వివరించినట్లు తెలుస్తోంది.

బీకేకు టికెట్ డౌటే..

నారా లోకేశ్ ప్రసంగంలో బీకే పార్థసారథిని గెలిపించాలని ఎక్కడా పిలుపునివ్వలేదు. టీడీపీని గెలిపించండి.. టీడీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని చెప్పారు. లోకేశ్ ప్రసంగం చూస్తే బీకే పార్థసారథికి పెనుకొండ టికెట్ అనుమానమే అనిపిస్తోంది.

స్పందన కరువు..

గోరంట్ల: లోకేష్ పాదయాత్ర సోమవారం ఉదయం 9 గంటలకు రెడ్డిచెరువుకట్ట గ్రామం నుంచి ప్రారంభమై, చలమయ్యగారిపల్లి, చింతమానుపల్లి, జీనంవాడ్లపల్లి, గోరంట్ల మీదుగా గుమ్మయ్యగారిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక వరకు కొనసాగింది. అయితే ఎక్కడా పెద్దగా స్పందన కనిపించలేదు. మధ్యాహ్నం భోజన విరామంలో దీనిపై లోకేష్ స్థానిక నేతలను మందలించినట్లు తెలుస్తోంది. కనీసం జన సమీకరణ కూడా చేతకాకపోతే ఎలా అని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీంతో నేతలు అప్పటికప్పుడు పొరుగున ఉన్న నియోజకవర్గాల నుంచి తెలుగు తమ్ముళ్లను డబ్బు, మద్యం ఇచ్చి తరలించినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

బీటెక్ ఉత్తీర్ణులకు శిక్షణ

బత్తలపల్లి: బీటెక్‌లో ఈసీఈ, ఈఈఈ బ్రాంచ్‌ల్లో ఉత్తీర్ణులై... ఇంకా ఉద్యోగం పొందని యువతకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సిడాప్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు బత్తలపల్లిలోని భారతి మండల సమాఖ్య ఏపీఎం సుదర్శన్‌రాజు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రామగిరిలోని స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాల వేదికగా ఆరు నెలల పాటు రెసిడెన్షియల్ శిక్షణ ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఆసక్తి ఉన్న వారు పేర్లను ముందస్తుగా నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 91823 16114లో సంప్రదించవచ్చు.

చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడిగా బైసాని



హిందూపురం టౌన్: జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ అధ్యక్షుడిగా బైసాని రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 26న అనంతపురంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ అధ్యక్షుడు పైడా కృష్ణ ప్రసాద్ నేతృత్వంలో నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేసి పాలకవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ క్రమంలో జిల్లా అధ్యక్షుడిగా హిందూపురం పట్టణానికి చెందిన బైసాని రాంప్రసాద్‌ని ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికపై సోమవారం హిందూపురం వాణిజ్య, పరిశ్రమల సంఘం నాయకులు చంద్రగుప్త, దొంతి మహేంద్ర, కట్టా వెంకటేష్, షనవాజ్, ఇక్బాల్, సలీమ్, గోవర్ధన్ గుప్త, అబీద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మోటార్ రివైండింగ్‌పై శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో ఈ నెల 30 నుంచి మోటార్ రివైండింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ లోకనాథరెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నెల రోజుల శిక్షణా కార్యక్రమంలో ఉచిత వసతితో పాటు భోజన సదుపాయాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న యువకులు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు 96188 76060, 94925 83484లో సంప్రదించవచ్చు.

సర్వేతో సర్వ హక్కులు!

తాతలకాలం నాటి నుంచి భూమి సాగు చేస్తున్నా హక్కులేదు. దశాబ్దాలుగా గ్రామకంఠం భూమిలో ఇల్లుకట్టుకుని ఉంటున్నా అత్యవసరంలో అమ్ముకునే వీలులేదు. అసలు ఆస్తి తమదని చెప్పేందుకు ఎలాంటి ఆధారం లేదు. ఇలాంటి వారందరికీ ప్రభుత్వం హక్కులు కల్పిస్తోంది. 'వైఎస్సార్ జగనన్న భూహక్కు – భూరక్ష' పథకంలో భాగంగా భూముల సమగ్ర రీసర్వే చేపట్టిన అధికారులు గ్రామకంఠం భూములను సర్వే చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే హక్కుదారులకు పట్టాలిచ్చేందుకు ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉంది.

- జిల్లాలో ముమ్మరంగా రీసర్వే పనులు
- ఇప్పటికే 24 గ్రామాల్లో సర్వే పూర్తి
- మరో 411 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి
- గ్రామకంఠాలు ప్రత్యేకంగా సర్వే చేస్తున్న అధికారులు
- ప్రక్రియ పూర్తయితే హక్కుదారులకు పట్టాలు



పుట్టపర్తి అర్బన్: రాష్ట్రంలో వందేళ్లుగా భూముల సర్వే చేయకపోవడం వల్ల భూ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఏ భూమిలో ఎవరుంటున్నారో తెలియని పరిస్థితి. పట్టాలు భూములకు సంబంధించే కోర్టుల్లో వివాదాలు నడుస్తున్నాయి. ఇక గ్రామ కంఠాల పరిస్థితి చెప్పనక్కరలేదు. దాదాపుగా గ్రామ కంఠం భూములన్నీ అసైన్డ్‌గా ఉండడంతో ఎలాంటి లావాదేవీలు జరగవు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్వమిత్వ పథకం ద్వారా ఈ భూములను సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సైతం 'వైఎస్సార్ జగనన్న భూ హక్కు, భూ రక్ష' పథకంలో భాగంగా రీ సర్వే చేయనున్న భూముల్లో గ్రామ కంఠాలను చేర్చింది.

ముమ్మరంగా సర్వే పనులు..

జిల్లాలో సమగ్ర రీసర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 461 రెవెన్యూ గ్రామాల పరిధిలో 467 పంచాయతీలున్నాయి. ఇందులో ఇప్పటి వరకూ 411 గ్రామాల్లో అధికారులు డ్రోన్ ద్వారా సర్వే పూర్తి చేశారు. మరో 24 గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతున్నాయి. ఇంకో 3 గ్రామాల్లో సర్వే చివరి దశగా భావించే 13 నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. దాదాపు 32 మంది మండల సర్వేయర్లు, 392 మంది విలేజ్ సర్వేయర్లు కలిపి 424 మంది పాల్గొంటున్నారు.

రీ సర్వేతో లాభాలెన్నో..

రీసర్వేలో భాగంగా గ్రామ కంఠం భూములను సర్వే చేస్తున్నారు. దీంతో సంబంధిత స్థలానికి పూర్తి హద్దులు, విస్తీర్ణం కచ్చితంగా తెలుస్తుంది. ముఖ్యంగా సర్వేతో భూ వివాదాలు, భూ తగాదాలు పూర్తిగా తొలగిపోతాయి. ఈ సర్వే పూర్తయిన తర్వాత లబ్ధిదారులకు ప్రభుత్వం హక్కు కల్పిస్తూ ఆస్తి ధ్రువీకరణ పత్రం ఇస్తుంది. దీంతో ఈ భూములపై బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవడంతో పాటు క్రయ విక్రయాలకూ అవకాశం ఉంది.

3 గ్రామాల్లో 13 నోటిఫికేషన్ ఇచ్చిన గ్రామాలు..

గ్రామ కంఠం భూముల సర్వేకు సంబంధించి జిల్లాలోని మూడు గ్రామాల్లో అధికారులు 13 నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో బత్తలపల్లి మండలం రాఘవంపల్లి, చెన్నరాయపట్నం, గాండ్లపెంట మండలం కమతంపల్లి, సోమందేపల్లి మండలం ఎస్.కొత్తపల్లి ఉన్నాయి. ఈ గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించి పట్టాలు మంజూరు చేస్తారు. ఇక తొలి విడతలో 24 గ్రామాల్లోని గ్రామకంఠాల సర్వే పూర్తి చేశారు. ఇందులో బత్తలపల్లి మండలం చెన్నరాయపట్నం, గాండ్లపెంట మండలం కమతంపల్లి, వదిరి మండలం అలంపూర్, కదిరికుంట్లపల్లి, సోమందేపల్లి మండలం ఎస్.కొత్తపల్లి, కనగానపల్లి మండలం ముత్తువకుంట్ల, ముదిగుబ్బ మండలం ఛాగాపురం, నక్కలగుట్టపల్లి, గాండ్లవాండ్లపల్లి, రామగిరి మండలం శేషాద్రిహట్రహళ్లి, మక్కినవారిపల్లి, తాడిమర్రి మండలం తిరుమలాపురం, నల్లచెరువు మండలం ములకలపల్లి, గోరంట్ల మండలం దేవులచెరువు, ఓబులాపురం, రాగిమేకలపల్లి, కాటేపల్లి, పెనుకొండ మండలం బొజ్జిరెడ్డిపల్లి, సీకేపల్లి మండలం ప్యాదిండి, అమడగూరు మండలం దాదెంవారిపల్లి, తలుపుల మండలం బండ్లపల్లి, ఓడీసీ మండలం నరసంబొట్లపల్లి ఉన్నాయి. త్వరలోనే ఆయా గ్రామాల్లోని గ్రామ కంఠం భూములు అనుభవంలో ఉన్న వారికి పట్టాలు మంజూరయ్యే అవకాశం ఉంది.

జిల్లా జియోగ్రాఫికల్ ఏరియా	8,925 చదరపు కిలోమీటర్లు
రెవెన్యూ గ్రామాలు	461
గ్రామ పంచాయతీలు	467
డ్రోన్ సర్వే పూర్తయిన గ్రామాలు	411
సర్వేలో పాల్గొంటున్న సర్వేయర్లు	424

గ్రామ కంఠాలన్నీ సర్వే చేస్తాం

రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ కంఠం భూములను సర్వే చేస్తాం. ఇప్పటి వరకూ సర్వే పూర్తయిన 24 గ్రామాల్లో స్థానికులు పూర్తిగా సహకరించారు. మిగతా గ్రామాల్లోనూ సర్వే పూర్తయితే వివాదాలు, భూ తగాదాలు సమిసిపోతాయి. తొలి మొదటి విడత సర్వే దాదాపు పూర్తి కావచ్చింది. ప్రస్తుతం 3 గ్రామాల్లో 13 నోటిఫికేషన్ విడుదల చేశాం.

– రామక్రిష్ణ, ఏడీ, ల్యాండ్ అండ్ సర్వే

త్వరలో పట్టాలిస్తాం

గ్రామ కంఠం భూములను పూర్తి స్థాయిలో సర్వే చేస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రభుత్వం అర్హులకు పట్టాలు అందిస్తుంది. దీనివల్ల ఏళ్లుగా భూమిలో ఉన్న వారికి ఒక ఆధారం దొరుకుతుంది. పట్టాలు మంజూరైతే క్రయ విక్రయాలకూ అవకాశం ఉంటుంది.

– విజయ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

యువకుడి బలవన్మరణం



మృతుడు ఇర్షాద్

హిందూపురం: స్థానిక మేళాపురం నివాసి ఇర్షాద్ (32) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం వన్‌టౌన్ సీఐ ఈరన్న తెలిపారు. కూలి పనులతో జీవనం సాగించే ఇర్షాద్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సంసారాన్ని పట్టించుకోకుండా, జులాయిగా మారాడు. దీంతో అప్పులు అధికం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేఉకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనకు సంబంధించి ఇర్షాద్ భార్య జమీనాభాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, మృతుడికి ఆరేళ్ల లోపు వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి హుండీ కానుకల లెక్కింపును సోమవారం చేపట్టారు. రూ.16,95,130 ఆదాయం సమకూరినట్లు దేవదాయ శాఖ ఈఓ శోభ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ రమణకుమారి, ఎంపీటీసీ సభ్యుడు రాజారెడ్డి, కో–ఆప్షన్ సభ్యురాలు షాబీరా, గ్రామస్తులు లింగారెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'కుమారుడికి కిడ్నీ దానం చేస్తా.. అనుమతించండి'



కొండయ్య వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

కొత్తచెరువు: రెండు కిడ్నీలు చెడిపోయి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తన కుమారుడిని బతికించుకునేందుకు తన కిడ్నీని దానం చేసేందుకు ఓ తండ్రి సిద్ధమయ్యాడు. ఇందుకు సంబంధించి సాంకేతిక ఇబ్బందులు తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌ను కలసి విన్నవించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌కు పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు గ్రామానికి చెందిన కొండయ్య వినతిపత్రం అందజేశారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న కొండయ్య కుమారుడు రమేష్ కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో రెండు కిడ్నీలు పాడయ్యాయి. దీంతో కిడ్నీ మార్చాల్సిందేనని వైద్యులు స్పష్టం చేశారు. అయితే ఇందుకు సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో పోలీసు విచారణ నివేదిక అందజేయాలంటూ ఎస్పీని కొండయ్య కలసి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ వెంటనే ఎస్‌బీ విచారణకు ఆదేశించి, నివేదిక తెప్పించుకుని బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీకి కొండయ్య కృతజ్ఞతలు తెలిపారు.

భర్త తరపు బంధువుల నుంచి రక్షణ కల్పించండి..

తన భర్త తరపు బంధువుల నుంచి ప్రాణహాని ఉందని, వారి బారి నుంచి రక్షణ కల్పించాలంటూ ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌కు ఓ వివాహిత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీని కలసి వినతి పత్రం అందజేసింది. బాధితురాలు తెలిపిన మేరకు... ముదిగుబ్బకు చెందిన మౌనికకు మూడేళ్ల క్రితం శ్యామ్‌కుమార్‌తో వివాహమైంది. ప్రస్తుతం వీరికి ఓ కుమార్తె ఉంది. పెళ్లి సమయంలో చిత్తూరు జిల్లాలో ఉద్యోగం చేస్తున్నట్లు నమ్మించారు. వారి మాటలు నమ్మి పెళ్లి సమయంలో 10 తులాల బంగారు నగలు, లక్ష రూపాయలను తల్లిదండ్రులు వరకట్నంగా ఇచ్చారు. ఇటీవల బావ సుధీర్‌తో పాటు భర్త తరపు బంధువులు మహేష్, లక్ష్మీదేవి, నాగరత్నమ్మ, కృష్ణమూర్తి చాడీలు చెప్పి తనకు తన భర్తకు మధ్య విభేదాలు సృష్టించారు. అంతేకాక తనకు లొంగకపోతే భర్త నుంచి శాశ్వతంగా విడిపోయేలా చేస్తానంటూ మహేష్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. వీరికి అత్త, మామ తోడయ్యారు. ఇప్పటికే తాను ఎన్నో బాధలు అనుభవించానని, ఇక వారి వేధింపులు భరించలేకపోతున్నానన, వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని ఎస్పీకి బాధితురాలు ఫిర్యాదు చేసింది. కాగా, వివిధ సమస్యలపై 42 వినతులు అందినట్లు జిల్లా పోలీసు కార్యాలయం వెల్లడించింది. అర్జీలను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.వి.రామకృష్ణ ప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విషపు నీరు తాగి మేకలు మృతి



మృతి చెందిన మేకలను చూపుతున్న రామ్మోహనాచారి

ముదిగుబ్బ: ప్రమాదవశాత్తు విషం కలిపిన నీరు తాగి మేకలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన మేరకు... ముదిగుబ్బ మండలం ఎస్.బ్రాహ్మణపల్లికి చెందిన రామ్మోహనాచారి మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం మేకలను మేపునకు సమీపంలోని అటవీ ప్రాంతానికి తోలుకెళ్లాడు. మధ్యాహ్నం సమీపంలోని తోటలోకి వెళ్లిన మేకలు.. అక్కడ డ్రమ్ములో పంట పొలాలకు పిచికారీ చేసేందుకు క్రిమి సంహారక మందు కలిపిన నీటిని తాగాయి. ఘటనలో 15 మేకలు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు కాపరి రామ్మోహనాచారి వాపోయాడు. బాధితుడిని ఆదుకోవాలని ఈ సందర్భంగా అధికారులను స్థానికులు కోరారు.

జెడ్పీలో 32 మందికి స్థానచలనం

పని తీరు ప్రామాణికంగా సీట్ల కేటాయింపు



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు స్థాన చలనం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పనితీరు వివాదస్పదంగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని మరో సెక్షన్‌కు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు సీఈఓ భాస్కరరెడ్డి, డిప్యూటీ సీఈఓ జిల్లా శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ అమృత రాజ్ నివేదించిన నివేదికకు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆమోద ముద్ర వేశారు. మొత్తం 32 మందికి సెక్షన్లు మారుస్తూ ఉత్వరులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న వారిలో పరిపాలనాధికారులతో పాటు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, నాల్గో తరగతి ఉద్యోగులూ ఉన్నారు. కాగా, సాధారణ బదిలీల అనంతరం ఇతర ప్రాంతాల నుంచి చాలా మంది ఉద్యోగులు బదిలీపై జెడ్పీకి వచ్చారు. అయితే కొందరు ఉద్యోగుల పనితీరు సక్రమంగా లేకపోవడంతో వారిపై చైర్‌పర్సన్ గిరిజమ్మతో పాటు ముఖ్య అధికారులు అసంతృప్తితో ఉండేవారు. ప్రస్తుతం పనితీరు ఆధారంగా సెక్షన్లు మార్పు, సీట్ల కేటాయింపు చేయడంతో త్వరలో అన్ని సెక్షన్ల ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ సమావేశం కానున్నట్లు తెలిసింది.

బదిలీ అయిన వారు వీరే..

ఉద్యోగి	హోదా	ప్రస్తుత చోటు	బదిలీ స్థానం
బీఎస్ శ్రీనివాసులు	ఏఓ	కె-సెక్షన్	జి-సెక్షన్
వి.ధనుంజయనాథ్	ఏఓ	ఐ-సెక్షన్	ఎల్, కె-సెక్షన్
బీపీ రవిప్రసాద్	ఏఓ	ఎల్-సెక్షన్	ఐ-సెక్షన్
బి.రాఘవేంద్రుడు	ఎస్ఏ	జి-5, జి-7	ఎ-2
ఫణిశేఖర్‌రెడ్డి	ఎస్ఏ	బి-సెక్షన్	ఎల్-2, ఎల్-3
భానురేఖ	ఎస్ఏ	ఎఫ్-1	జి-6, జి-9
బి.శారద	ఎస్ఏ	ఎఫ్-1	జి-6, 9
నరసింహమూర్తి	ఎస్ఏ	డి-2	డి-2
కె.అరుణ కుమారి	ఎస్ఏ	డి-1	డి-1
పి.పద్మావతి	ఎస్ఏ	హెచ్-2	హెచ్-2
మహేష్	ఎస్ఏ	డి-5	డి-5
మేషియా	ఎస్ఏ	జి-1, జి-2	జి-2
రక్షిత	జేఏ	డి-6	డి-6
మర్తాడు షేక్ రఫీ	జేఏ	ఎ-4	ఎ-4
కేశవ	జేఏ	జి-4	జి-4
పి.రఘురాం	జేఏ	ఎ-4	జి-1, 5, 7
బి.సుశీలాదేవి	జేఏ	హెచ్-2	ఎఫ్-5
ఎం.పద్మావతి	జేఏ	ఎఫ్-5	బి-సెక్షన్
ఎం.రవికుమార్	టైపిస్ట్	ఎ-సెక్షన్	పీఎఫ్-కంప్యూటరైజేషన్
ఎం.నాగశిరీష	టైపిస్ట్	పీఎఫ్-కంప్యూటరైజేషన్	ఎ-సెక్షన్

సాంకేతిక ఖ్యాతి

- 'సీమ'కే తలమానికం జేఎన్‌టీయూ(ఏ) కళాశాల
- నేటి నుంచి రెండు రోజులపాటు 77వ వార్షికోత్సవం



అనంతపురం: రాయలసీమకే తలమానికం.. ఎంతో మంది ప్రతిభావంతులను సాంకేతిక నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దిన విద్యానిలయం. అదే జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల. ఇక్కడ చదివిన ఎందరో విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. వారెందరో సొంతంగా కంపెనీలు స్థాపించి వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల 77వ వార్షికోత్సవ వేడుకలు మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు అట్టహాసంగా జరగనున్నాయి. ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన హాజరు కానున్నారు.

అ'పూర్వ' ఘట్టాలెన్నో...

గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి. 1964లో బీటెక్ మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందారు. టైఫాయిడ్ కారణంగా ఇంజినీరింగ్ కోర్సును మధ్యలోనే ఆపేసి నెల్లూరుకు వెళ్లిపోయారు. ఆ తర్వాత గాయకుడిగా జగద్విఖ్యాతి గాంచారు. అందుకే తన పూర్వ విద్యార్థి అయిన బాలసుబ్రహ్మణ్యంకు జేఎన్‌టీయూ(ఏ) సుమున్నతంగా సత్కరించింది. 2010లో గౌరవ డాక్టరేట్‌ను అందించింది.

- యూపీఎస్సీ మాజీ సభ్యుడు, జేఎన్‌టీయూ హైదరాబాద్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) మాజీ వీసీ ప్రొఫెసర్ వై.వెంకట్రామిరెడ్డి 1968–72 బ్యాచ్‌లో బీటెక్ (ఈసీఈ) ఇక్కడే చదివారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు రెండు దఫాలు వీసీగా పనిచేశారు. ఏపీపీఎస్సీ చైర్మన్‌గా విధులు నిర్వర్తించి, యూపీఎస్సీ సభ్యులుగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. జేఎన్‌టీయూఏ 12వ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్‌ను అందించారు.
- 1980–84లో బీటెక్ (ఈసీఈ) పూర్తి చేసిన జి.సతీష్‌రెడ్డి 1986లో డీఆర్‌డీఓ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబోరేటరీ)లో చేరారు. 2014లో డీఆర్‌డీఓ శాస్త్రవేత్తగా ఎన్నో ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారు. 2018లో డీఆర్‌డీఓ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, అస్త్ర, ఆకాశ్, యాంటీ-రేడియేషన్ మిస్సైల్, స్మార్ట్ ఎయిర్ ఫీల్డ్ వెపన్స్ ఆవిష్కరణల్లో కీలక పాత్ర పోషించారు.
- 1960–64లో గల్లా రామచంద్రనాయుడు బీటెక్ (ఈఈఈ) పూర్తి చేశారు. 2008లో జేఎన్‌టీయూ అనంతపురం నుంచి డాక్టరేట్ పొందారు. అమరరాజా ఫ్యాక్టరీని స్థాపించి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు.
- జేఎన్‌టీయూ అనంతపురం ప్రస్తుత వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన ఈ కళాశాల విద్యార్థే కావడం విశేషం. 1983–87లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో బీటెక్ పూర్తి చేసిన ఆయన 1992లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కెరీర్ ప్రారంభించారు. అనంతరం పలు హోదాల్లో పని చేశారు. ఏపీపీఎస్సీ సభ్యులుగా పనిచేసిన ఆయన 2021 జనవరి 15న జేఎన్‌టీయూఏ వీసీగా నియమితులయ్యారు.
- జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ ఇదే యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.
- జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ ఎంటెక్, పీహెచ్‌డీ ఇక్కడే పూర్తి చేశారు.
- ప్రస్తుత క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత జేఎన్‌టీయూ అనంతపురం 1989–93 మధ్య ఈటెక్, తర్వాత ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. తాను చదివిన కళాశాలకే ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

కళాశాల ఏర్పడిందిలా..

రెండో ప్రపంచ యుద్ధం జరిగిన సమయంలో 1945లో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పడింది. మద్రాసు గిండిలో తరగతులు నిర్వహించారు. అనంతరం 1946లో అనంతపురంలో తరగతులు నిర్వహించారు. యుద్ధఖైదీలు ఉండే బ్యారక్స్‌లో తరగతులు ప్రారంభమయ్యాయి. అప్పటి మద్రాస్ ముఖ్యమంత్రి ఓ.రంగస్వామి రెడ్డియార్ జేఎన్‌టీయూ కళాశాల క్యాంపస్‌కు 300 ఎకరాలు కేటాయించారు. 1958లో కళాశాల మెయిన్ భవనాన్ని రూ.18 లక్షలతో నిర్మించారు. ఇందులో మూడు ల్యాబొరేటరీలు, ఒక వర్క్ షాప్, బ్లాక్ అండ్ పవర్ హౌస్ ఉండేవి. 1946 నుంచి 1955 వరకు మద్రాసు వర్సిటీకి అనుబంధంగా కళాశాల కొనసాగేది. 1955–1972 వరకు ఎస్వీ యూనివర్సిటీ అనుబంధంగా ఉంది. తర్వాత జేఎన్‌టీయూ హైదరాబాద్ పరిధిలోకి వెళ్లింది.


వైఎస్సార్ చలువతో యూనివర్సిటీగా..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ కళాశాలను యూనివర్సిటీగా మార్చారు. రాయలసీమ జిల్లాలతో పాటు పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలను యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చారు. రాయలసీమలో సాంకేతిక విద్యను అందించే దిశగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్సిటీ మార్పు చేయడంతో లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు చదవడానికి ఆస్కారం ఏర్పడింది.

పూర్వ విద్యార్థుల చేయూత

తాము చదివిన ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనందిస్తున్నారు. ఉన్నత స్థానాన్ని అధిరోహించడానికి దోహదపడ్డ కళాశాలకు దన్నుగా నిలవాలనే ఉద్దేశంతో ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటిదాకా రూ.69 లక్షలను నేరుగా చెక్కుల రూపంలో విరాళాలు అందించారు. శిల్పా హాస్టల్ మరమ్మతులకు రూ.4.5 లక్షలు అందజేశారు.

పూర్వ జన్మ సుకృతం



నేను ఇదే కళాశాలలో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తిచేశాను. ప్రస్తుతం వీసీ హోదాలో విధులు నిర్వర్తిస్తుండడం పూర్వ జన్మసుకృతంగా భావిస్తున్నాను. పూర్వ విద్యార్థులు సహకారం అందిస్తుండడం ఆనందంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కళాశాలకు జాతీయస్థాయి గుర్తింపు తెచ్చేలా కృషి చేస్తున్నాం.

– ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం